క్లుప్తంగా

త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలి



నిర్మాణ దశలోని ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ సాయినాథ్

గూడూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ అన్నారు. పట్టణ సమీపంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పురోగతిని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో పూర్తిచేయాల్సి ఉందన్నారు. ప్రతిరోజూ 40 ఇళ్ల నిర్మాణ పనుల్లో, వాటి నిర్మాణ స్థాయిలు మారాలని, ఇదే లక్ష్యంగా కలిసి పనిచేయాలన్నారు. హౌసింగ్ డీఈ చలమయ్య, ఏఈ షబ్బీర్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

జువ్వినట్టులో రెవెన్యూ గ్రామసభ

వాకాడు: జువ్వినట్టు పంచాయతీలో గురువారం జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా రెవెన్యూ అధికారులు సాదా బైన మాపై గ్రామసభ నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సారంగపాణి, ఎంపీడీఓ గోపీనాథ్, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొని శాశ్వత భూహక్కు కోసం రైతుల నుంచి తమ పొలాలకు సంబంధించిన పత్రాలు పరిశీలన చేశారు. సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

రాపూరు: రాపూరులో ఫిబ్రవరి నెలలో జరిగే 98వ గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ ఫారాన్ని ఈనెల 23వ తేదీలోపు అందజేయాలని రాపూరు జోన్ వైస్ ప్రెసిడెంట్ దయాకర్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9490947694, 9440196596 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ



బాధిత కుటుంబానికి బీమా నగదు ఇస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్: భర్త మృతిచెందడంతో మృతుడి భార్యకు ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు వైఎస్సార్ బీమా నగదును గురువారం పంపిణీ చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో 18వ వార్డు పరిధిలో గరిడి వీధిలో నివాసం ఉంటున్న షేక్ మునీర్(37) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఈక్రమంలో మృతుని భార్య షేక్ షాహిదాకు గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెంచయ్య మొదలియార్ చేతుల మీదుగా రూ.10 వేలు అందించారు. మిగిలిన నగదు బాధితురాలి బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుందని సచివాలయ అడ్మిన్ షేక్ అక్తర్, వెల్ఫేర్ కార్యదర్శి బల్లి సురేంద్ర తెలిపారు.

వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, క్షేత్రస్థాయిలో ఆ దిశగా సేవలందజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక రెండవ పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఆయన డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయన ఆస్పత్రుల వారీగా సమస్యలపై ఆయన చర్చించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

విజేత జయంపు ఏబీఆర్ యూత్ జట్టు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కార్తీక్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): సంక్రాంతి పండగ పురస్కరించుకుని మండలంలోని జయంపు గ్రామంలో జరిగిన వీకేఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో జయంపు ఏబీఆర్ యూత్ జట్టు విజయం సాధించగా గొట్టికాడు జట్టు రన్నర్‌గా నిలిచింది. జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి విజేతలకు ప్రథమ బహుమతి రూ.10,016, ద్వితీయ బహుమతి రూ.5,016 నగదు బహుమతి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు మల్లెల వెంకటేశ్వర్లు, టోర్నమెంట్ నిర్వాహకులు నాగరాజు, కోటి, కార్తీక్, లోకేష్ పాల్గొన్నారు.

కండలేరులో 51.231 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 51.231 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,460, పిన్నేరు వాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు30, హైలెవల్ స్లూయిజ్‌కు 50, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

చంద్రబాబుతో రాష్ట్రం నాశనం

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



తమ్మినపట్నంలో వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిల్లకూరు: పద్నాలుగేళ్లు పాలించిన చంద్రబాబు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఇప్పుడు మరోసారి అవకాశం ఇస్తే బాగు చేసి చూపిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు దుయ్యబట్టారు. తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, కొత్తూరు, అన్నంబాక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసిన చంద్రబాబుకు వెన్నులో వణుకు పుడుతోందని అన్నారు. అందుకే ఆయన బేల మాటలు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నారని, దీనిపై కూడా నమ్మకం లేక పలువురితో పొత్తు పెట్టుకుని పోటీలో దిగేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏ ఎన్నికలైనా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సింగిల్‌గా వచ్చి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసారి చంద్రబాబు కుప్పంలో ఓడిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి కానరాలేదని అంటున్నారని కళ్లున్న వారు నేరుగా గ్రామాల్లో పర్యటించి అక్కడ నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలు, పాఠశాల భవనాలను చూడాలని అన్నారు. అనంతరం గ్రామంలోని మత్స్యకారులకు రావాల్సిన ప్యాకేజీ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడతామని తెలిపారు. దివ్యాంగుడు మూడు చక్రాల సైకిల్ ఇప్పించాలని కోరారు. వీటిపై అప్పటికప్పుడే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యం, జెడ్పీటీసీ శీనయ్య, వైస్ ఎంపీపీ చెంగయ్య, ఎరటపల్లి జానకిరామిరెడ్డి, ఎంపీటీసీలు జానకిరాం కోటేశ్వరరావు, నేతలు శివకుమార్, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి చేస్తా!

- ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి



డీఎస్పీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

గూడూరు: గూడూరు డీఎస్పీ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఈమేరకు నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. పట్టణంలోని హైస్కూల్ రోడ్డులోని డీఎస్పీ కార్యాలయాన్ని, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, నేతలతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ డీఎస్పీ కార్యాలయ భవనం తండ్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో ఆయన కృషితో ఈ భవనం నిర్మించారన్నారు. ప్రస్తుతం అది పూర్తిగా దెబ్బతిందన్నారు. ఈ మేరకు ఎస్పీతో మాట్లాడానని, నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అదేవిధంగా గూడూరు పట్టణ నడిబొడ్డున అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం ఏర్పాటు చేశారని చెప్పారు. ఎమ్మెల్యే, ఆర్డీఓలతో మాట్లాడి, స్టేడియం నూతన కమిటీని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలో స్టేడియాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖా మంత్రి రోజాతో మాట్లాడి నిధుల మంజూరుకు తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. నేతలు దిలీప్‌రెడ్డి, హరికృష్ణ, యోగి, దాసరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

దొరవారిసత్రం: ఉచ్చూరు గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు హాజరు కావాలని పార్టీ నేతలు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

చిల్లకూరు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఎంపీడీఓ విష్ణుచిరంజీవి కోరారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరు–2 సచివాలయం పరిధిలో ఒక వలంటీర్ ఎస్సీ(పురుషుడు), నెలబల్లిరెట్టపల్లిలో ఎస్సీ జనరల్ (2) అవసరం కావడంతో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. దరఖాస్తులను ఈనెల 29తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 31న ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. చిల్లకూరు మండల సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఈనెల 23 గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విష్ణుచిరంజీవి తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

సూళ్లూరుపేట జేసీఎస్ కన్వీనర్ల ఎంపిక



జేసీఎస్ కన్వీనర్లతో ఎమ్మెల్యే కిలివేటి, చిత్రంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థకు సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలకు, రెండు మున్సిపాలిటీలకు కొత్తగా కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. దీనికి సంబంధించి తిరుపతిలోని భీమాస్ ప్యారడైజ్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎంపికలు చేశారు. సూళ్లూరుపేట రూరల్‌కు మందా దేవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట అర్బన్‌కు అయితా శ్రీధర్, నాయుడుపేట రూరల్‌కు ఒట్టూరు కిషోర్ యాదవ్, నాయుడుపేట అర్బన్‌కు చదలవాడ కుమార్, ఓజిలి మండలానికి షేక్ ఖాదర్‌బాషా, పెళ్లకూరు మండలానికి కరణం రఘురామనాయుడు, దొరవారిసత్రం మండలానికి ఈ. శ్రీనివాసులురెడ్డి, తడ మండలానికి ఆర్‌కే సుందర్‌రెడ్డిని ఎంపిక చేశారు. వీరి ఆధ్వర్యంలో సచివాలయ కమిటీ కన్వీనర్లు, గృహసారథులు పనిచేయాల్సి ఉంటుంది. ఈ కమిటీ ఇప్పటి నుంచి పనిచేస్తుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు.

వేంకటేశ్వరస్వామి పాదాలను తాకిన సూర్యకిరణాలు



గర్భగుడిలో ఉన్న స్వామివారి పాదాలను తాకుతున్న సూర్యకిరణాలు

నాయుడుపేటటౌన్: తిమ్మాజికండ్రిగ గ్రామం వద్ద స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న అభయ అనుగ్రహ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం ఉదయ అద్భుతం చోటుచేసుకుంది. ఆలయంలోని గర్భగుడిలోని వేంకటేశ్వరస్వామి విగ్రహం వద్ద స్వామివారి పాదాలను తాకుతూ సూర్యకిరణాలు ప్రసరించడంతో వేదపండితులు అద్భుతమని అన్నారు.

ఐసీఐసీఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



వినతి పత్రాన్ని ఎమ్మెల్యే వరప్రసాద్‌కు అందజేస్తున్న సభ్యులు

గూడూరు: ఐసీఐసీఐ ఫౌండేషన్ ద్వారా రైతులకు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసులు గురువారం ఎమ్మెల్యేని కలిశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రైతులకు ఇరిగేషన్ పనులను చేపట్టాలని ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ శిరీషను గతంలో కోరామన్నారు. ఈ మేరకు ఫౌండేషన్ డెవలప్‌మెంట్ అధికారిని పంపామని తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేతో పలు విషయాలపై చర్చించి, రైతులతో కలిసి వినతి పత్రం అందేజేశారు. బాల గోపాల్, రైతులు కృష్ణారెడ్డి, మహేంద్రయాదవ్ పాల్గొన్నారు.

విజయవంతంగా ఏటి పండగ వేడుకలు

నాయుడుపేటటౌన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో ఏటి పండుగ వేడుకలను మున్సిపల్ అధికారులు విజయవంతంగా నిర్వహించారని చైర్ పర్సన్ కటకం దీపిక అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపడంతో ఏటి పండగ వేడుకలను అధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పలువురు దాతలతో మూడు రోజుల పాటు వైభవంగా జరుపుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సంజీవయ్యకు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావుకు పట్టణ ప్రజల తరఫున చైర్ పర్సన్ దీపిక కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



సమీక్షలో మాట్లాడుతున్న పీడీ జ్యోతి

నాయుడుపేటటౌన్: మహిళలను అన్నింటా అగ్రగామిగా నిలిపేందుకు తోడ్పాటు అందించే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి వైఎస్సార్ క్రాంతి పథం అధికారులను ఆదేశించారు. నాయుడుపేట శ్రీశక్తి భవన్‌లో గురువారం సూళ్లూరుపేట నియోజవర్గ వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన అధికారులతో మాట్లాడి వారి పని తీరును పీడీ పరిశీలించారు. తిరుపతి జిల్లా ఏపీడీ ప్రభావతి, డీపీఎంలు మాధవి, వనజాక్షి, ఏరియా కోఆర్డినేటర్ ఈ మురళి, ఏపీఎం ప్రసన్నకుమారి పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పీడీతో పాటు ఎల్‌డీఎం సుభాష్ బ్యాంకర్లతో సమావేశం జరిపారు. ఎంపీడీఓ శివప్రసాద్ పాల్గొన్నారు.

జీవితాలకు దిక్సూచి వేమన పద్యాలు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వెంకటపతిరెడ్డి



రాపూరులో..



సైదాపురం ఎంపీడీఓ కార్యాలయంలో..



9వ బెటాలియన్‌లో..



నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో..

గూడూరు: మనందరి జీవితాలకు వేమన పద్యాలు ఒక దిక్సూచి లాంటివని, విద్వాన్ డాక్టర్ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేమన పద్యం, త్రయీ అనే పుస్తకాలను వారు ఆవిష్కరించారు. హైదరాబాద్ వర్సిటీ ప్రొఫెసర్ విజయలక్ష్మి, వెంకటాచలం ప్రాచీన అధ్యయన కేంద్రం డైరెక్టర్ సంపత్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, ఇంద్రసేనమ్మ, వెంకట సుధీర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మధురెడ్డి, ధనుంజయరెడ్డి, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ పాల్గొన్నారు.

వేమనకు నివాళి

రాపూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ అమోస్‌బాబు, ఎంఈఓ శ్రీనివాసులు, ఏపీఓ చిన్నయ్య, ఈఓపీఆర్డీ వీర్రాజులు, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు పెంచలరెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

9వ బెటాలియన్‌లో..

వెంకటగిరిరూరల్: వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్ ఎం.అరుణ్‌బోస్ ఆధ్వర్యంలో యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. ఏఓ చంద్రమౌళి, డాక్టర్ శేషమ్మ పాల్గొన్నారు.

నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో...

నాయుడుపేటటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరావు యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట



మన్నారుపోలూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్లలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట పండినట్టుగా ఉందని, నిరుపేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ మన్నారుపోలూరు సచివాలయం పరిధిలోని పెద్దగిరిజనపాళెం, చిన్న గిరిజనపాళెం, ఎన్‌టీఆర్ కాలనీ, బ్రాహ్మణవీధి, శ్రీకాళహస్తిరోడ్డులోని కాలనీల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. పలువురు వృద్ధులు ఎమ్మెల్యేకు దండం పెడుతూ ఒకటో తేదీకంతా పింఛన్లు ఇంటికే తెచ్చి ఇస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024లో ఓడిపోతామన్న భయంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పటి నుంచే నాటకాలాడుతున్నారని అన్నారు. నమ్మితే నట్టేట ముంచే నైజం చంద్రబాబుది, ప్యాకేజీ తీసుకుని వంతపాడే నైజం పవన్‌కల్యాణ్‌ది అని అన్నారు. 2024 ఎన్నికల్లో ఆరెండు పార్టీలకు బుద్ధి చెప్పి జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాలని అన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా జగనన్నను ఆదర్శంగా తీసుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కౌన్సిలర్లు మునస్వామి, సుశీల, మహేశ్వర్, లక్ష్మీదేవి, విజయలక్ష్మి, మునిప్రసాద్, నేతలు టి. ప్రసాద్, తిరుపాల్, కో–ఆప్షన్ సభ్యులు బాబూరావు, సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్ల ఎంపిక

- తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్లను ఎంపిక చేసినట్లు తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీ జేసీఎస్ కన్వీనర్‌గా పులి ప్రసాద్‌రెడ్డి, రూరల్‌కు ఎం.వెంకటేశ్వర్లు, డక్కిలికి చింతల శ్రీనివాసులురెడ్డి, రాపూరుకు దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, సైదాపురం మన్నారపు రవికుమార్, బాలాయపల్లికి తాళ్లూరి వెంకట బంగారుప్రసాద్, కలువాయికి మాదాసు పవన్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఎంపిక చేసిన ఆయా మండలాల్లోని సచివాలయ కన్వీనర్లు జేసీఎస్ కన్వీనర్ ఆధ్వర్యంలో పార్టీ పటిష్టతకు కృషిచేస్తారని పేర్కొన్నారు.

అవినీతికి పాల్పడితే ఉపేక్షించం..

ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీసేలా అవినీతికి పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని కలువాయి మండలంలో జరిగిన భూకుంభకోణానికి బాధ్యులైన తహసీల్దార్‌ను నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో అధికారులు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలకు సేవచేయాలని ఆదేశించారు.

డిజిటల్ అసిస్టెంట్‌కు సన్మానం



మునిశేఖర్‌ను సన్మానిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

దొరవారిసత్రం: కల్లూరు గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ఎం మునిశేఖర్‌ను గురువారం సూళ్లూరుపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓ కిరణ్‌కుమార్ సన్మానించి ఆయన అందించిన సేవలను అభినందించారు. కల్లూరు సచివాయం డిజిటల్ అసిస్టెంట్ మునిశేఖర ఏపీ సేవ సర్వీసెస్ సేవలు 4,393 అత్యధికంగా తిరుపతి జిల్లాలోనే అందించి ప్రథమ స్థానం సాధించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో కల్లూరు సచివాలయాన్ని ఆర్డీఓ ప్రత్యేకంగా సందర్శించి డిజిటల్ అసిస్టెంట్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింగయ్య, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్, వీఆర్వో మధు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పరిశీలన

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మున్సిపాలిటి పరిధిలోని మన్నారుపోలూరులో జగనన్న కాలనీలను సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఆర్డీఓ కిరణ్‌కుమార్ గృహనిర్మాణశాఖ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె. రవికుమార్, ఎంపీడీఓ ప్రమీలారాణి, గృహనిర్మాణశాఖ ఏఈ అక్రమ్ పాల్గొన్నారు.

కోలాహలంగా గ్రామదేవతలకు గ్రామోత్సవం



బల్లవోలులో దేశమ్మ..



ఏరూరులో మండలమ్మ..



గూడలిలో గౌరమ్మ గ్రామోత్సవం

చిల్లకూరు: సంక్రాంతి సందర్భంగా పలు గ్రామాల్లో గ్రామదేవతలకు పొంగళ్లు పెట్టి గ్రామోత్సవాలను కోలాహలంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు గ్రామదేవతలు పెంటపాటమ్మ, మండలమ్మ, దేశమ్మ, మహాలక్ష్మమ్మ, చెన్నకేశవస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డీజేలతో పాటు పాట కచ్చేరీలు నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పెంటపాడులో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

కోట: గూడలి, నెల్లూరుపల్లిలో గురువారం గౌరమ్మ గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలు



వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ

వెంకటగిరిరూరల్: సాగులో ఉన్న వరిపంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చునని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని వల్లివేడు గ్రామంలో సాగులో ఉన్న వరిపంటను గురువారం పరిశీలించారు. ఏఓ సుజాత, వీఏఓ చెంచుభాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మల ఊరేగింపు



నిమజ్జనానికి గొబ్బెమ్మలు

సైదాపురం: స్థానికంగా వైభవంగా గొబ్బెమ్మలకు పూజలు నిర్వహించారు. విచిత్రమైన వేషధారణలు వేసి నృత్యాలు చేస్తూ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని అనంతరం నిమజ్జనం చేశారు.